క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన పొన్నలూరు ఎస్సై


ఎస్సై అనుక్

పొన్నలూరు: మండల నూతన ఎస్సైగా కె.అనుక్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న గిరిబాబు బదిలీపై పెదకూరపాడు వెళ్లడంతో ఆయన స్థానంలో వీఆర్‌లో ఉన్న అనుక్‌ను నియమించారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలను కాపాడతామని, పేకాట, బెట్టింగులను అరికడతామని అన్నారు. ప్రజలంతా పోలీసులకు సహకరించి గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని కోరారు.

బాధ్యతలు చేపట్టిన నూతన డీటీ


డీటీ పేరం నాగరాజు

మర్రిపూడి: మర్రిపూడి మండల నూతన డిప్యూటీ తహసీల్దార్‌గా పేరం నాగరాజు సోమవారం బాధ్యతలు చేపట్టారు. కొండపి మండలంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై మర్రిపూడి వచ్చినట్లు ఆయన తెలిపారు. గతంలో ఇక్కడ పనిచేసిన భూపతి బదిలీపై కంభం మండలానికి వెళ్లారు.

వాహనదారులకు జరిమానా


వాహనదారులకు జరిమానా విధిస్తున్న ఎస్సై ప్రేమ్‌కుమార్

కొండపి (టంగుటూరు): కొండపి సెంటర్లో వాహనాలను ఎస్సై ప్రేమ్‌కుమార్ సోమవారం తనిఖీ చేసి పత్రాలు లేని 10 మందికి జరిమానా విధించారు. ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించి ప్రతిఒక్కరూ విధిగా డ్రైవింగ్ లైసెన్సు, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని సూచించారు. ఆటోడ్రైవర్లు అందరూ యూనిఫాం వేసుకోవాలని తెలిపారు. రోడ్డుపై ఇబ్బందికరంగా ఆటోలు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి


రక్షణాపురం వాసులతో మాట్లాడుతున్న ఎస్సై మాధవరావు

హనుమంతునిపాడు: వాహన దారులు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్సై కె.మాధవరావు అన్నారు. సోమవారం కంభం– కనిగిరి రహదారి హాజీపురం అడ్డ రోడ్డు వద్ద వాహనదారులను ఆయన తనిఖీ చేశారు. ఆటోవాలలకు, ద్విచక్ర వాహనదారులకు రోడ్డు నిబంధనలపై సూచలు సలహాలిచ్చారు. డ్రైవింగ్ చేసేటప్పుడు వాహనదారులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వాహన దారులు రోడ్డు నియమ నిబంధనలు పాటించాలన్నారు. వాహనదారులకు లైసెన్స్ ఉండాలని చెప్పారు. హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తపై విచారణ

వెలిగండ్ల: మండలంలోని గోకులం పంచాయతీ మల్లంరాజుపల్లి అంగన్‌వాడీ కార్యకర్తపై కలెక్టర్ ఆదేశాల మేరకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కమలకుమారి, కో ఆర్డినేటర్ సామ్యూల్‌లు సోమవారం విచారణ చేపట్టారు. మల్లంరాజుపల్లి అంగన్‌వాడీ కార్యకర్త విధుల నిర్వహణలో అవకతవకలకు పాల్పడిందని కొందరు గ్రామస్తులు ఒంగోలులో జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఐసీడీఎస్ సిబ్బంది సోమవారం మల్లంరాజుపల్లి అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి విచారణ చేపట్టి నివేదికను ఉన్నతాధికారులకు పంపించారు.

పంటల మార్పిడితో ప్రయోజనాలు

- భూసారం పెరిగి అధిక దిగుబడులు
- రసాయనిక ఎరువుల ఖర్చు తగ్గే అవకాశం
- తెగుళ్లు, చీడపీడల నుంచి పంటలకు రక్షణ
- రైతులకు వ్యవసాయాధికారుల సూచనలు


పొన్నలూరులో మిరప మొక్కలు నాటుతున్న కూలీలు


భూమికి సేంద్రియ ఎరువుగా మారే కంది పంట

పొన్నలూరు: ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో గ్రామాల్లో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. రైతులు పొలాలు దున్ని పంటలు సాగు చేసే పనిలో నిమగ్నమయ్యారు. అయితే, ఏటా ఒకే రకమైన పంటలు సాగు చేయడం వలన భూములు నిస్సారంగా మారి వ్యవసాయంలో ఆశించినంతగా ఫలితాలు ఉండటం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో రైతులు పంట మార్పిడి పద్ధతులు అవలంబిస్తే మంచి దిగుబడులు పొందవచ్చని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. పంట మార్పిడి వలన పంటల దిగుబడి పెరగడమే కాకుండా భూమి కూడా సారవంతమవుతుందని చెబుతున్నారు. ఏటా ఒకే రకమైన పంటలు సాగు చేయడం ద్వారా పంట దిగుబడులు తగ్గడమే కాకుండా భూమి నిస్సారవంతంగా మారి తెగుళ్లు, చీడపీడల సమస్య కూడా ఎక్కువగానే ఉంటుందని అంటున్నారు. ముఖ్యంగా పంట మార్పిడిలో భాగంగా నేలంతా కప్పేలా ఉండే పంటలను ఎంపిక చేసుకోవాలని వ్యవసాయశాఖ సిబ్బంది సూచిస్తున్నారు. ఇలా చేయడం వలన పంటలో కలుపు మొక్కలు ఎక్కువగా రాకుండా ఉంటాయి. అలాగే నేల భౌతిక స్థితిలో కూడా మార్పు వస్తుంది. అలాగే భూమిలో నీరు నిల్వ ఉండే శక్తి వృద్ధి చెంది చీడపీడలు దూరమవుతాయి. ఫలితంగా పంటల రక్షణకు ఉపయోగించే రసాయన ఎరువుల ఖర్చు కూడా తగ్గుతుంది.

భూమికి మేలు చేసే అపరాల పంటలు...

పంటల మార్పిడిలో భాగంగా అపరాల పంటలైన కందులు, మినుము, సజ్జ, పెసలు, ఉలవలు వంటి వివిధ రకాల పంటలు సాగు చేయడం వలన వాటి వేర్లు భూమి నుంచి పోషకాలను సులభంగా తీసుకుంటాయి. అలాగే అపరాల పంటలు కొంత మేర నీటి ఎద్దడిని కూడా తట్టుకుంటాయి. ప్రధానంగా అపరాల పంటల ఆకులు రాలడం వలన భూమికి సేంద్రీయ ఎరువుగా ఉపయోగపడుతుంది. ఈ పంటల వేరు మొదళ్ల నత్రజనని స్థిరీకరిస్తాయి. మొత్తంగా అపరాల పంటలు సాగు చేయడం వలన చాలా వరకు రాలిన ఆకుల రూపంలో సేంద్రీయ ఎరువు లభిస్తుంది.

తెగుళ్ల, చీడపీడల నివారణ కోసం...

ప్రతి ఏటా ఒకే రకమైన పంటలు సాగు చేయడం వలన కొన్ని రకాల పురుగులు, తెగుళ్లు పంటను ఆశించి వృద్ధి చెందుతాయి. దీని వలన పంట దిగుబడి కూడా చాలా వరకు తగ్గిపోతుంది. ఈ క్రమంలో ఏటా సాగు చేసే పంటను కాకుండా మార్పిడి చేసుకోవాలి. ఉదాహరణకు వరుసగా వరి పంట సాగు చేయకుండా పప్పు దినుసులు, నువ్వులు వంటి పంటలు సాగు చేసుకుంటే మేలు జరుగుతుంది. మినుములు, వేరుశనగ వంటి పంటలను లద్దె పురుగులు ఎక్కువగా ఆశించి నష్టపరుస్తాయి. వీటి ఉధృతిని అరికట్టేందుకు జొన్న, వరి, రాగులు వంటి ఆరుతడి పంటలతో మార్పు చేయాలి. పత్తి వేసిన పొలంలో మిరప పంట సాగు చేస్తే లాభదాయకంగా ఉంటుంది. వరి వేసే పొలానికి ముందుగా కట్టెలు, జనుములు వేస్తే సేంద్రీయ ఎరువుగా తయారై పంటకు మంచి దిగుబడి ఉంటుంది. అలాగే ఏటా పొగాకు సాగు చేసే భూమిలో అపరాల పంటలు సాగు చేసి ఆ తర్వాత ఏడాది పొగాకు సాగుచేస్తే మళ్లె తెగుళ్ల రాకుండా నాణ్యమైన పొగాకు పండుతుంది. మొత్తంగా రైతులు పంట మార్పిడి వ్యవసాయం చేయడం వలన లాభదాయకంగా ఉంటుంది.

పంట మార్పిడితో అధిక దిగుబడి



పంటల మార్పిడితో దిగుబడి పెరుగుతుంది. వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఉలవలు, రాగులు సాగుచేస్తే భూమి సారవంతంగా మారుతుంది. అలాగే భూమిలో జనుము కట్టెలు వేసి బాగా దున్నితే సేంద్రియ ఎరువు తయారవుతుంది. దీని వలన రసాయన ఎరువుల ఖర్చు తగ్గుతుంది. ప్రస్తుతం మార్కెట్‌లో రాగులు, మినుములు, సజ్జ వంటి అపరాల పంటలకు మంచి గిరాకీ ఉన్నందున ఈ పంటలు సాగుచేసుకోవచ్చు.

– టి.పూర్ణచంద్రరావు, ఏవో, పొన్నలూరు

ఉపాధి హామీ మస్టర్లలో అవకతవకలు

- సర్వసభ్య సమావేశంలో నిలదీసిన జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు

పొన్నలూరు: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనుల్లో కూలీల మస్టర్లలో భారీగా అవకతవకలు జరుగుతున్నాయని జెడ్పీటీసీ సభ్యుడు బెజవాడ వెంకటేశ్వర్లు ఉపాధి సిబ్బందిని నిలదీశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనుల్లో దొంగ మస్టర్ల తీరును జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి కూలీల మస్టర్లలో గ్రామాల్లో లేని వారి పేర్లకు కూడా పనిచేసినట్లు మస్టర్లు వేసుకుని ఉపాధి హామీ నిధులు కాజేస్తున్నారన్నారు. ఒకే పని ఫొటోను అనేక పనులకు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ దొంగ మస్టర్లు వేస్తున్నారన్నారు. గ్రామాల్లో లేని వారి పేర్లు, వృద్ధాప్యంతో మంచంలో ఉండి నడవలేని వాళ్ల పేర్లకు కూడా మస్టర్లు వేస్తూ వేల రూపాయల ఉపాధి నిధులను సొమ్ముచేసుకుంటున్నారని ప్రశ్నించారు. ఉపాధి హామీలో జరుగుతున్న అక్రమాలను ఆధారాలతో ప్రజావేదికలో బయటపెడతామన్నారు. ఎంపీపీ మాధవరావు మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు సోకి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ఆరోగ్య సిబ్బంది పట్టించుకోవడం లేదన్నారు. అలాగే గత ప్రభుత్వంలో చేసిన పనులకు సంబంధించిన బిల్లులను విడుదల చేయాలని ఆయా శాఖల అధికారులను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుజాత, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

టంగుటూరులో పొగాకు వేలం పూర్తి


మాట్లాడుతున్న వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో వేలాన్ని సోమవారంతో ముగించినట్లు వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలం కేంద్రం పరిధిలో పొగాకు సాగుదారుల సంఖ్య 2,865గా, బ్యారన్‌ల సంఖ్య 2,828.19గా, అధీకృత ప్రాంతం 5,351.37 హెక్టార్లుగా, నాటిన ప్రాంతం 7,147 హెక్టార్లుగా, అందులో అధీకృత పరిమాణం 10.00 మిలియన్ల కేజీలుగా, అందులో అంచనా వేయబడిన పరిమాణం 16.00 మిలియన్ కేజీలుగా, విజిలెన్స్, స్వీపింగ్ పొగాకుతో సహా విక్రయించబడిన పరిమాణం 16.1 మిలియన్ల కేజీలుగా నమోదైనట్లు వివరించారు. ఈ సీజన్లో సగటు ధర కేజీ రూ.279గా నమోదైందన్నారు. గత పంట సీజన్‌తో పోలిస్తే ప్రస్తుత పంట సీజన్‌లో గుర్తించిన సగటు ధర రూ.58 అని అన్నారు. విక్రయించిన పొగాకు మొత్తం విలువ రూ.450,21,85,411.20, ఆకు అమ్మకానికి వేలం రోజుల సంఖ్య 152, వేలం విక్రయాల్లో పాల్గొన్న కంపెనీల సంఖ్య 49, రోజుకు అమ్మిన సగటు బేళ్లు 856, కేజీలలో రోజుకు అమ్మిన సగటు పరిమాణం 1,06,446, ఆఫర్ చేసిన మొత్తం బేళ్లు 1,45,829, విక్రయించిన మొత్తం బేళ్లు 1,30,066గా వెల్లడించారు. గత సీజన్‌లతో పోల్చితే అన్ని గ్రేడ్‌లకు మార్కెట్‌లో మంచి ధరలు లభించడం, అధీకృత పొగాకును అధిక మొత్తంలో విక్రయిస్తే జరిమానాలను రద్దు చేయడంతో సాగుదారులు సంతోషం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారన్నారు. వేలం ముగింపు సందర్భంగా వేలం నిర్వహణ అధికారి అట్లూరి శ్రీనివాసరావుకు, కంపెనీ బయ్యర్లకు, బోర్డు సిబ్బందికి సన్మానం చేశారు.

ఆర్డీఓను కలిసిన ఎన్జీవో నేతలు


ఆర్డీఓను సన్మానిస్తున్న ఎన్జీవో నేతలు

కనిగిరి రూరల్: కనిగిరి ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డిని సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఎన్జీవో సంఘ నేతలు, విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయనకు విన్నవించారు. అనంతరం ఆర్డీఓ కేశవర్ధన్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఏపీ ఎన్జీవో తాలుకా అధ్యక్షుడు పిల్లి వెంకట రమణారెడ్డి, మాజీ ఎన్జీవో అధ్యక్షుడు చిలకల శివరామిరెడ్డి, పెన్షనర్ల సంఘం డివిజన్ అధ్యక్షుడు తమ్మినేని పెద్దిరెడ్డి, సంఘ నాయకులు చెన్నయ్య, చెంచు రామయ్య పాల్గొన్నారు.

ఆర్డీఓను సన్మానించిన చైర్మన్, కమిషనర్

ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డిని సోమవారం స్థానిక కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, కమిషనర్ డానియల్ జోసఫ్‌లు కలిశారు. పలు సమస్యలపై చర్చించారు. అనంతరం ఆర్డీఓను చైర్మన్, కమిషనర్‌లు ఘనంగా సన్మానించారు.

అంకితభావం ఉన్న ఉద్యోగి శ్రీనివాసులు


ఏఓ శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీడీఓ


పీసీపల్లిలో సన్మానం అందుకుంటున్న అధికారులు

పామూరు: ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్న వ్యక్తి మండల పరిషత్ కార్యాలయ పాలనాధికారి ఊట్ల శ్రీనివాసులు అని ఎంపీపీ గంగసాని లక్ష్మి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, ఎంపీడీఓ బొలినేని సురేష్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా పొదిలి మండలానికి వెళ్లిన ఊట్ల శ్రీనివాసులును ప్రజాప్రతినిధులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. వైస్ ఎంపీపీ గంథం యేసురత్నం, కో ఆప్షన్ షేక్ నాయబ్‌రసూల్, సీనియర్ అసిస్టెంట్ కేటీవీఎస్ నరసింహారావు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరి రామిరెడ్డి పాల్గొన్నారు.

పీసీపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ హోదాల్లో ఉంటూ బదిలీపై వెళ్లిన ఉద్యోగులను మంగళవారం సహచర ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. కార్యాలయ పర్యవేక్షకుడు రమణారెడ్డి, సీనియర్ సహాయకులు నాగమణి, జూనియర్ సహాయకులు బ్రహ్మయ్య, టైపిస్ట్ పురుషోత్తం, పంచాయతీ కార్యదర్శులు నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, కిరణ్ కుమార్, శేషమ్మలను సన్మానించారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

పీసీపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం, బుధవారం రెండు రోజుల పాటు మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల ఉప సర్పంచ్‌లకు, ఇద్దరు వార్డు సభ్యులకు, సాధారణ, పరిపాలనా విధానాలపై శిక్షణ తరగతులు ఏర్పాటు చేయనున్నట్లు ఏవో ప్రభాకర్ తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీల నుంచి శిక్షణకు హాజరు కావాలని ఆయన కోరారు.

నగరేశ్వర ఆలయానికి వెండి పానువట్టం


వెండి పానువట్టం సమర్పిస్తున్న భక్తులు

పామూరు: మండల కేంద్రం పామూరు వాసవీకన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణం నగరేశ్వర ఆలయంలోని నగరేశ్వర స్వామి వారి అలంకరణ కోసం దాతలు సుమారు 4 కేజీల వెండి పానువట్టం సమకూర్చారు. ఈ సందర్భంగా సోమవారం వెండి పానువట్టాన్ని దాతలు విశ్వనాథుని మోహన్‌రావు దంపతులు ఆలయ చైర్మన్ యేల్చూరి బాలకొండలరావు, కార్యదర్శి సేగు కృష్ణయ్య, కోశాధికారి దరిశి మస్తాన్‌రావులకు అందజేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి అలంకరించారు. కొత్తూరి హరగోపాల్, గురు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కారు బోల్తా.. ముగ్గురికి గాయాలు


సహాయక చర్యల్లో సీఐ ఖాజావలి

కనిగిరి రూరల్: రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే తక్షణం స్పందించి ఘటన స్థలానికి వచ్చి వాహనం కింద ఉన్న క్షతగాత్రులను స్వయంగా తానే బయటకు తీసి ఆస్పత్రికి తరలించిన కనిగిరి సీఐ ఎస్‌కే ఖాజావలి మానవత్వం పలువురు మన్ననలు పొందింది. ఈ సంఘటన సోమవారం జరిగింది. వివరాలు.. పొదిలి నుంచి కడప జిల్లా ప్రొద్దుటూరుకు చక్కా అశోక్‌కుమార్, అతని భార్య భార్గవి, కుమారుడు అశ్విన్ కారులో వెళ్తున్నారు. మార్గంమధ్యలో మాచవరం దాటిన తర్వాత చిన అలవలపాడు సమీపంలో కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనలో కారు కింద పడి ఉన్న క్షతగాత్రులను వెలికి తీసేందుకు సీఐ ఎస్‌కే ఖాజావలి స్వయంగా తానే సహాయక చర్యలు చేపట్టారు. సీఐ ఖాజావలి, ఎస్సై శ్రీరాం, పోలీసులు వెంటనే క్షతగాత్రులైన అశోక్ కుమార్, భార్గవి, అశ్విన్‌లను అంబులెన్స్‌లో ఎక్కించి ఆస్పత్రికి తరలించారు. సహాయక కార్యక్రమాల్లో సీఐ చేతికి కూడా స్వల్ప గాయమైంది.

వధూవరులకు దద్దాల ఆశీర్వాదం


వధూవరులను ఆశీర్వదిస్తున్న దద్దాల


ముళ్ల నరహరికి ఆర్థిక సాయం చేస్తున్న దద్దాల

పీసీపల్లి: మండల పరిధిలోని వెంగళాయిపల్లిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన అత్యల వారి వివాహ వేడుకల్లో కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల్ నారాయణ యాదవ్ పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. మండల పార్టీ కన్వీనర్ గోపవరపు బొర్రారెడ్డి, శీలం సుదర్శనం, ఎంపీటీసీ సభ్యులు భూమిరెడ్డి కొండారెడ్డి, సర్పంచ్ మూలే రాజశేఖరరెడ్డి, సూరా మాల్యాద్రి, కరణం మహాలక్ష్మయ్య, కె.పెద్దిరెడ్డి, పెద్దన్న, కోటపాటి తిరుపతయ్య, అత్యాల హనోకు, ముప్పారపు ఆశీర్వాదం, అత్యాల పేతురు, ముప్పారపు షడ్రక్ బాబు, కేసారపు యేసేబు, యోహాను, డేవిడ్ రాజు, కిశోర్, యాకోబు, సామేలు, నాయకులు ఆదినారాయణరెడ్డి, వాకమళ్ల రాజశేఖర్, ఈర్ల శ్రీను పాల్గొన్నారు.

ముళ్ల నరహరికి ఆర్థిక సాయం

వెలిగండ్ల: మండలంలోని మొగళ్లూరుకు చెందిన ముళ్ల నరహరి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణ యాదవ్ మొగళ్లూరుకు వెళ్లి నరహరిని పరామర్శించారు. రూ.20 వేల ఆర్థిక సహాయం అందచేశారు. తమ్మినేని శివరామిరెడ్డి, పల్నాటి భాస్కర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఆవుల తిరుపతిరెడ్డి, వెంకటేశ్వర్లు, టి.నాని, గంజి రవీంద్ర, సుబ్బారెడ్డి, వాకమళ్ల రాజశేఖర్, సైకం ఏడుకొండలు, పోయిన మురళి, సిరివెళ్ల సురేంద్రబాబు, మీసాల వెంకటరెడ్డి, ముళ్ల మహేష్, చెన్నారెడ్డి, మురళి, కెరటాలు, దాదీ పాల్గొన్నారు.

నరవీర హరికి కూడా..

మండలంలోని తమ్మినేనిపల్లికి చెందిన పల్నాటి నరవీర హరి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ తమ్మినేనిపల్లికి వెళ్లి నరవీర హరిని పరామర్శించారు. రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. తమ్మినేని శివరామిరెడ్డి, పల్నాటి బాస్కర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఆవుల తిరుపతిరెడ్డి, వెంకటేశ్వర్లు, టి.నాని, గంజి రవీంద్ర, సుబ్బారెడ్డి, వాకమళ్ల రాజశేఖర్, సైకం ఏడుకొండలు పాల్గొన్నారు.

పల్నాటి రాములమ్మకు నివాళి

మండలంలోని మొగళ్లూరుకి చెందిన పల్నాటి బాలకోటయ్య మాతృమూర్తి పల్నాటి రాములమ్మ సోమవారం కన్నుమూశారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ పల్నాటి రాములమ్మ పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. తన ప్రగాఢ సానుభూతి తెలియచేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు పల్నాటి భస్కర్‌రెడ్డి, సైకం ఏడుకొండలు, వాకమళ్ల రాజశేఖర్ పాల్గొన్నారు.

ఎంపీపీకి మాతృవియోగం


పెదకోటమ్మకు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మర్రిపూడి: మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి మాతృమూర్తి వాకా పెదకోటమ్మ (84) మృతిచెందారు. గత నెలలో పక్షవాతానికి గురై చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం అర్ధరాత్రి తుదిశ్వాస విడిచారు. మృతదేహాన్ని స్వగ్రామం గుండ్లసముద్రం తరలించగా, పలువురు రాజకీయ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, పీడీసీసీబీ మాజీ చైర్మన్ మాదాసి వెంకయ్య ఫోన్ ద్వారా వెంకటరెడ్డి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు బోద రమణారెడ్డి, నాయకులు మాచేపల్లి నాగయ్య, మాకినేని వెంకట్రావు, వైఎస్సార్ సీపీ పొదిలి మండల కన్వీనర్ హనీమూన్ శ్రీనివాసరెడ్డి, సానికొమ్ము శ్రీనివాస రెడ్డి, యర్రమోతు వెంకటేశ్వర్లు, గొలమారి చెన్నారెడ్డి, కముజుల బ్రహ్మారెడ్డి, అలికేపల్లి కోటేశ్వర రావు, ఇనుకొల్లు మాదిరెడ్డి, ఇనుకొల్లు శ్రీనివాస రెడ్డి, మాకినేని రమణయ్య ఉన్నారు.

జాజం వెంకటేశ్వర్లుకు ఘన నివాళి

పామూరు: ఆరె మరాఠీ సంఘ నాయకులు, వార్డు మాజీ సభ్యుడు జాజం వెంకటేశ్వర్లు (60) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా సోమవారం జరిగిన దశదిన ఖర్మ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, బెస్త సంక్షేమ సంఘ నాయకులు ఓగూరి ఏడుకొండలు, పార్టీ మండల రైతు సంఘ నాయకులు కందుల శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా మండలి నాయకురాలు గాయకవాడ సుహాసిని పాల్గొన్నారు.

వైభవంగా దేవీశరన్నవ రాత్రి ఉత్సవాలు


కనిగిరి: నందనమారెళ్ల గుడిలో ప్రత్యేక పూజలు


జమ్ములపాలెంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కనిగిరి రూరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం కనిగిరిలో వైభవంగా నిర్వహిస్తున్నారు. పట్టణంతో పాటు మండలంలోని వివిధ ఆలయాల్లో కొలువుదీరిన దేవతా మూర్తులకు విశిష్ట పూజలు జరిగాయి. పలుచోట్ల అమ్మవారు వివిధ రూపాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చి ప్రత్యేక పూజలు అందుకున్నారు. కనక దుర్గమ్మ గుడి, అంకాళమ్మ గుడి, శ్రీ మద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం, దొంతులమ్మ గుడి, సాయిబాబా గుడిలో, లక్ష్మీ నరసింహస్వామి ఆలయాల్లో ఆయా కమిటీల ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా విశిష్ట పూజా కార్యక్రమాలు జరిగాయి. శివనగర్ కాలనీలోని దత్త పీఠంలో శ్రీ లలితా పరమేశ్వరి రూపాలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక గార్లపేట రోడ్డులోని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు, కళ్యాణోత్సవాలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం జరిగింది. మండంలోని నందనమారెళ్లలోని బాలకోటేశ్వర స్వామి దేవస్థానంలో చండీహోమం, రుద్రాభిషేకాలు చేశారు. వేద పండితులు పెనుబాకుల రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

పామూరు: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా 5వ రోజు పామూరులో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో సోమవారం వాసవీకన్యకా పరమేశ్వరీదేవి అమ్మవారు శ్రీ నారాయణీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అదే విధంగా వల్లీభుజంగేశ్వరస్వామి ఆలయంలో వల్లీఅమ్మవారు విశిష్ట అలంకరణలో భక్తులకు దర్శనమీయగా మహాలక్ష్మమ్మ దేవస్థానంలో అమ్మవారు గాయత్రీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

పీసీపల్లి: మండల పరిధిలోని పెదయిర్లపాడు శైవ క్షేత్రం మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శరన్నవరాత్రిలో భాగంగా సంతాన లక్ష్మీగా అమ్మవారు దర్శనం ఇచ్చారు. సంతాన లక్ష్మి అలంకారంతో అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. దేవి ఖడ్గమాల, అష్టోత్తర పూజ, లలితా సహస్ర నామ పూజ, శ్రీచక్ర పూజ, కుంకుమార్చన నిర్వహించి తీర్థప్రసాదాలు ఇచ్చారు. పలుకూరి సుబ్బారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ తల్లి దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఐదో రోజు మహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వివిధ పూలతో అలంకరణలు చేశారు. రాత్రికి అమ్మవారికి ఉత్సవ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఈఓ రమేష్ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జమ్ములపాలెం, పొందూరు, టంగుటూరు గ్రామాల్లో అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

మర్రిపూడి: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా స్థానిక శివాలయంలో సోమవారం మహంకాళీ దుర్గాదేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు నుదురుపాటి అంబయ్య పంతులు శివపార్వతులకు అభిషేకం చేశారు. అమ్మవారిని నూతన వస్త్రాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చన చేశారు. అమ్మవారు మహంకాళీ దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి సహస్రనామపూజ, అష్టోత్తరం, ఖడ్గమాల పూజలు నిర్వహించారు. మేడా నరసింహారావు దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. మహిళలు భక్తిపాటలతో అలరించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

పొన్నలూరు: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని నాగిరెడ్డిపాలెంలో చండీదేవి అవతారంలో పోలేరమ్మతల్లి సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామంలోని మహిళలు, భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఆలయంలో శ్రీ చక్రార్చన, శతచండీ పారాయణం, శ్రీ సూక్తిపారాయణం నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.